సాక్షి
నంద్యాల
శనివారం । 21 । డిసెంబర్ । 2024



అన్నప్రసాదం పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు శుక్రవారం బెంగళూరుకు చెందిన ఎంవీ అభిలాష్ కుమార్‌రెడ్డి రూ.1,00,116 విరాళం అందజేశారు.



భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు. అలంకరించిన ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,628.49
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 88.501
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 1,613
అవుట్ ఫ్లో	: 6,721

న్యూస్‌రీల్

జగనన్న జన్మదిన వేడుకలు విజయవంతం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సాక్షి: జననేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని శనివారం జిల్లా వ్యాప్తంగా వేడుకలను విజయవంతంగా నిర్వహిద్దామని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు బాసటగా నిలిచిన జగనన్న జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు చేసేందుకు అభిమానులు, పార్టీ నేతలు సిద్ధమయ్యారన్నారు. శనివారం ఉదయం 7 గంటలకు కల్లూరులోని తమ నివాసంలో ముందుగా కేక్ కటింగ్ ఉంటుందన్నారు. జిల్లాలో జరిగే వేడుకల్లో అభిమానులు పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

పరీక్ష పే చర్చలో నమోదు చేసుకోండి

నంద్యాల(న్యూటౌన్): పరీక్ష పే చర్చ -2025 కార్యక్రమం వచ్చే నెల 14వ తేదీ వరకు జరుగుతున్నందున, అందులో పాల్గొనే పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు https://innovativeindia.mygov.in లో వివరాలు నమోదు చేసుకోవాలని డీఈఓ జనార్దన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా డైట్ లెక్చరర్ ఎండీ అష్ఫాక్‌ను నియమించినట్లు తెలిపారు. ఈయన ప్రతి రోజు నమోదును పర్యవేక్షిస్తారన్నారు. అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఇందులో పాల్గొనుటకు అర్హులన్నారు. జిల్లాలోని ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, సమగ్ర శిక్ష సిబ్బంది తగిన శ్రద్ధ తీసుకొని విద్యార్థుల వివరాలను పరీక్షపై చర్చ పోర్టల్‌లో నమోదు చేయించాలని డీఈఓ వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వారితో నేరుగా మాట్లాడి పరీక్షలకు సమర్థవంతంగా ఒత్తిడి లేకుండా ఎదుర్కోవడంపై సలహాలు సూచనలు ఇస్తారన్నారు.

8,240 క్యూసెక్కుల నీరు మళ్లింపు

శ్రీశైలం ప్రాజెక్ట్: ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలో గురువారం నుంచి శుక్రవారం వరకు పంప్‌మోడ్ ఆపరేషన్‌తో 8,240 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి మళ్లించారు. 7,419 క్యూసెక్కుల నీరు వినియోగించుకొని 3.462 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. జలాశయ పరిసర ప్రాంతంలో 1.20 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దిగువ నాగార్జునసాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల, హంద్రీనీవా సుజలస్రవంతి, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీకి 13,010 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రం సమయానికి జలాశయంలో 115.2484 టీఎంసీల నీరు నిల్వ ఉండగా డ్యాం నీటిమట్టం 862.90 అడుగులకు చేరుకుంది.

ఇంటి వద్దకే కార్గో సేవలు

నంద్యాల(న్యూటౌన్): కార్గో సేవలను విస్తృతం చేశామని, ఇంటి వద్దకే సరుకు రవాణా చేస్తున్నామని నంద్యాల ప్రజా రవాణా అధికారి రజియా సుల్తానా పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని కార్గో కార్యాలయంలో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ పార్శిల్, కొరియర్ సేవల్లో ముందుందన్నారు. తాజాగా డోర్ డెలివరీ సేవలను కూడా ప్రారంభించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు, వినియోగదారులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపోమేనేజర్ గంగాధర్ రావు, అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

బొమ్మలసత్రం: జిల్లా పోలీస్‌శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. పలువురు పోలీసులు ఎస్పీని కలిసి సమస్యలు విన్నవించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల కోసం వినతులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పిల్లలకు చదువే ఆస్తి..దీనిని మనస్ఫూర్తిగా నమ్మిన వైఎస్ జగన్ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. కార్పొరేట్‌కు దీటుగా సకల సౌకర్యాలు కల్పించారు. అత్యుత్తమ ప్రమాణాలతో డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టారు. సీబీఎస్‌ఈ ద్వారా పోటీ పరీక్షల్లో రాణించేందుకు బాటలు వేశారు. పేద పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు అందించాలనే ఉన్నత ఆశయంతో ముఖ్యమంత్రిగా ఆయన తీసుకొచ్చిన చదువుల విప్లవానికి ఆరునెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు మంగళం పాడుతోంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను నాశనం చేసి..ప్రైవేట్‌కు మేలు చేయడమే లక్ష్యంగా అద్భుత పథకాలను ఒక్కొక్కటిగా అటకెక్కిస్తోంది.



గోస్పాడు మోడల్ స్కూల్‌లో డిజిటల్ విద్యాబోధన దృశ్యం

జగనన్న ఏలుబడిలో..

వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు

- నాడు – నేడు కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖల మార్పు
- కార్పొరేట్‌కు దీటుగా సర్కారు స్కూళ్లలో సౌకర్యాలు, డిజిటల్ తరగతులు
- 69 పాఠశాలల్లో సీబీఎస్‌ఈ అమలు
- ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురవుతున్న విద్యావ్యవస్థ
- తిరోగమనంలో ప్రభుత్వ పాఠశాలలు
- ఇప్పటికే సీబీఎస్‌ఈ, ఐబీ రద్దు
- నేటికీ విడుదల కాని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- నేడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం



నాడు-నేడు పనులతో కార్పొరేట్‌కు దీటుగా నంద్యాల మండలం పెద్దకొట్టాల ప్రాథమిక పాఠశాల

సాక్షి, నంద్యాల: వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో చదువుల వెలుగులతో సర్కారు బడులు ప్రకాశించాయి. సరికొత్త చదువులు అందుబాటులోకి రావడంతో విద్యార్థులతో కళకళలాడాయి. చాక్ పీసులతో బోర్డుపై పాఠాలు బోధించే స్థాయి నుంచి డిజిటల్ విద్య వైపుగా అడుగులు పడ్డాయి. జిల్లాలో రెండు విడతల్లో నాటి ప్రభుత్వం 1,323 పాఠశాలల్లో 3,498 ఐఎఫ్‌పీ ప్యానళ్లను ఏర్పాటు చేసింది. విద్యార్థులు స్మార్ట్ మార్గంలో చదువులు కొనసాగించేలా ట్యాబ్‌లను అందజేసింది. 2022–23 విద్యా సంవత్సరంలో 20,730 ట్యాబ్‌లను, 2023–24 విద్యా సంవత్సరానికి 20,913 ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేసింది.



జగనన్న సర్కారు అందజేసిన ట్యాబ్‌లతో విద్యార్థినులు

విద్యార్థులకు జగనన్న 'కానుక'

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా నాడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా కానుకను ప్రవేశపెట్టారు. బడి తెరిచిన రోజే తొమ్మిది రకాల వస్తువులతో కూడిన కిట్‌ను విద్యార్థులకు అందజేసేవారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,347 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న సుమారు 1,62,348 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్, బెల్ట్, బూట్లు, సాక్స్‌లు, మూడు జతల యూనిఫాం, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఇచ్చే వారు. బయట మార్కెట్లో వీటి విలువ సుమారు రూ.5 వేల పైనే ఉంటుంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే నాటి ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను ఒక్కొక్కటిగా ఎత్తివేస్తుండటంతో వచ్చే ఏడాది నుంచి తమ పిల్లలకు విద్యా కానుక కిట్‌ను ఇస్తారో లేదోనని భయం పట్టుకుంది.





గోస్పాడు మోడల్ స్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్

సీబీఎస్‌ఈకి మంగళం...

కార్పొరేట్ పాఠశాలల్లో మాత్రమే అమలయ్యే సెంట్రల్ బోర్డు సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ)ను నాటి ప్రభుత్వం సర్కారు బడుల్లోకి తీసుకొచ్చింది. ఈ విద్యాబోధన వల్ల జాతీయ స్థాయి పోటీపరీక్షల్లో పేదల పిల్లలు రాణించేందుకు అవకాశం ఉంటుంది.ఈ ఉద్దేశంతో జిల్లాలో 69 పాఠశాలల్లో సీబీఎస్‌ఈని అమలు చేశారు. వీటి పరిధిలో సుమారు 6,300 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం తీసుకున్న సీబీఎస్‌ఈ రద్దు నిర్ణయంతో పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది.

ఫీజు బకాయిలపై కొరవడిన స్పష్టత

కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులతో చెలగాటమాడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా సతాయిస్తోంది. అసలు ఇస్తుందో లేదో చెప్పడం లేదు. దీంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని స్పష్టం చేస్తున్నాయి. 2017–18, 18–19లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే విడుదల చేసింది. ఆ తర్వాత ఐదేళ్లు ఉన్నత విద్య అభ్యసించే పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంది. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు వసతి దీవెన కింద చెల్లించాల్సిన డబ్బులను కూడా జమ చేయడం లేదు. కుటుంబ వార్షికాదాయం టీడీపీ ప్రభుత్వంలో రూ. లక్ష ఉండగా దాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.2.50 లక్షలకు పెంచింది. వసతి దీవెన కింద ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థులకు రూ.23 వేల ప్రకారం అందించింది. ప్రస్తుత సర్కారు దీనిని పెండింగ్‌లో ఉంచింది.

వైఎస్ జగన్ హయాంలో పేదింటి బిడ్డ కోసం..

రూ. 151.92 కోట్లు	విడుదలైన వసతిదీవెన మొత్తం
రూ. 345.28 కోట్లు	విడుదలైన ఫీజురీయింబర్స్‌మెంట్ మొత్తం
రూ. 483 కోట్లు	నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేసిన ఖర్చు
రూ. 800 కోట్లు	అమ్మఒడి పథకం కింద విడుదలైన మొత్తం



కొలిమిగుండ్ల ఉన్నతపాఠశాలలో ఆగిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం

నాడు–నేడుకు నిధులు లేవంట

జిల్లాలో మన బడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కాలేజీల రూపురేఖలు మారాయి. మొదటి విడతలో 486 పాఠశాలల్లో రూ.117 కోట్లతో 9 రకాల మౌలిక సదుపాయాలు కల్పించారు. రెండో విడతలో 973 స్కూళ్లలో రూ.366 కోట్లతో పనులు చేపట్టారు. చిన్నారులను ఆకర్షించేలా వివిధ రంగులతో బొమ్మలు, స్కూల్ వాతావరణాన్ని తీర్చిదిద్దారు. అలాంటి స్కూళ్లలో నాడు–నేడు పెండింగ్ పనులను కూటమి సర్కారు నిధులులేవంటూ నిలిపివేసింది. అంతేకాకుండా జిల్లాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న 27,577మంది విద్యార్థులకు ఇప్పటి వరకు రూ. 44.74 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదు. దీంతో ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు కాలేజీ ఫీజులు ఎలా చెల్లించాలని ఆందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వంలో ప్రశాంతంగా చదువులు



కూటమి ప్రభుత్వంలో విద్యార్థులు కష్టాలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా చదువుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా ఇంత వరకు ఫీజులు ఇవ్వలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం, మెస్ చార్జీలు రాలేదు. దీంతో విద్యార్థులు అప్పు చేసి కళాశాల ఫీజులు చెల్లించాల్సి వస్తుంది. -ధనుంజయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సెక్రటరీ, నంద్యాల

పిల్లలకు ఇచ్చే ఆస్తి మంచి చదువే



పిల్లలకు మనం ఇవ్వగలిగే ఆస్తి మంచి చదువులే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దడంతో పాటు అమ్మ ఒడి, గోరు ముద్ద, నాణ్యమైన దుస్తులు ఇవ్వడంతో విద్యార్థులు చక్కగా బడులకు వెళ్లే వారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రభుత్వ బడులను నిర్వీర్యం చేయాలని చూస్తే తల్లిదండ్రులు క్షమించరన్న విషయాన్ని పాలకులు గుర్తించుకోవాలి. – చంద్రశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్, నంద్యాల

ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాలి



నేను ఎంఎస్సీ ఫైనలియర్ చదువుతున్నాను. మొదటి సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరిలో కొంత ఫీజురీయింబర్స్‌మెంట్ వచ్చింది. మిగతాది ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందో తెలియడం లేదు. కళాశాలల్లో ఫీజులు చెల్లించాలంటే ఆర్థికంగా ఇబ్బంది అవుతుంది. ప్రభుత్వం స్పందించి పెండింగ్ మొత్తం త్వరగా విడుదల చేయాలి. -చరిత, విద్యార్థిని, నంద్యాల

నల్లమలలో పులుల గణనకు అధునాతన కెమెరాలు

- అటవీశాఖ బయోడైవర్సిటీ ల్యాబ్ ఏసీఎఫ్ ధనరాజ్

మహానంది: నల్లమలలో పులుల గణనకు అధునాతనమైన కెమెరాలు వినియోగించనున్నట్లు అటవీశాఖ బయోడైవర్సిటీ ల్యాబ్ ఏసీఎఫ్ ధనరాజ్ తెలిపారు. మహానందిలోని పర్యావరణ కేంద్రంలో శుక్రవారం ఎఫ్‌ఆర్‌ఓలు, డీఆర్‌ఓలు, ఎఫ్ఎస్ఓ, ఎఫ్‌బీఓ, ఏబీఓలకు పులుల గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ప్రతినిధులు దూపాడు శ్రీధర్, శంకర్ ప్రత్యేక టెక్నాలజీతో కూడిన యాప్‌లో ఎలా నమోదు చేయాలన్న అంశాలపై క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు. అనంతరం ఏసీఎఫ్ ధనరాజ్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ టైగర్ రిజర్వ్‌లో బ్లాక్-1 సెక్టారులో పులుల సంఖ్య, ఇతర వన్యప్రాణుల గుర్తింపు కోసం జనవరి 1వ తేదీ నుంచి 2400 కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పులుల చారలను బట్టి ఎన్ని ఉన్నాయో గుర్తిస్తామన్నారు. అలాగే వాటికి సరిపడ ఆహారం ఉందా లేదా అన్నది కూడా పరిశీలిస్తామని, ఒక పులికి ఆహారంగా ఏడాదికి 52 జింకలు ఉండాలన్నారు. అంటే పులి సంచరించే ప్రాంతంలో సుమారు ఐదు వందల జింకలు ఉండాల్సి ఉంటుందని చెప్పారు. గణనలో పులులు, చిరుతలతో పాటు జింకలు, నక్కలు, రేసు కుక్కలు, ఇతర వన్యప్రాణులను గుర్తిస్తామన్నారు. ఎఫ్‌ఆర్‌ఓలు ఉదయ్‌దీప్, దినేష్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌ఓలు హైమావతి, ముర్తుజావలి పాల్గొన్నారు.



అటవీ అధికారులకు సూచనలిస్తున్న ఏసీఎఫ్

ఏపీ మోడల్ స్కూల్‌కు జాతీయ అవార్డు

మహానంది: పర్యావరణం, జీవవైవిధ్యం పట్ల సున్నితమైన ఆలోచనలను సమాజంలో పెంపొందించే లక్ష్యంతో విప్రో సంస్థ ప్రతి ఏటా విప్రో ఎర్తియన్ పేరుతో అందించే జాతీయ అవార్డుకు తిమ్మాపురం ఏపీ మోడల్ పాఠశాల ఎంపికైందని ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుంచి 1550 ప్రాజెక్టులు రాగా మహానంది ఆదర్శ పాఠశాల నుంచి పంపిన జీవవైవిధ్య ప్రాజెక్టుకు జాతీయ అవార్డు వరించిందన్నారు. వృక్షశాస్త్రం అధ్యాపకురాలు శైలజ పర్యవేక్షణలో విద్యార్థుల కృషికి ఈ అవార్డు దక్కిందన్నారు. ఫిబ్రవరిలో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని, అప్పుడు మెమెంటో, సర్టిఫికెట్‌తో పాటు రూ. 50వేలు నగదు బహుమతి ఇస్తారన్నారు.

బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కైంకర్యాల్లో సమయపాలన పాటించాలి
- శ్రీశైలంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: జిల్లా యంత్రాంగ సహాయ సహకారాలతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1వ తేది వరకు క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. శుక్రవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై దేవస్థాన అన్ని యూనిట్ విభాగాల అధికారులు, ఇంజినీరింగ్, పర్యవేక్షకులు, వైదిక కమిటీతో దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో ప్రాథమిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానంలోని అన్ని విభాగాల అధికారులు, పర్యవేక్షకులు విభాగాల వారీగా చేపట్టాల్సిన పనులపై యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలోగా పనులన్నీ పూర్తికావాలన్నారు. గత ఏడాది కంటే ఈసారి 20శాతం నుంచి 30శాతం దాకా అదనపు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్సవాల్లో స్వామికి చేసే కైంకర్యాలన్నీ సంప్రదాయబద్ధంగా, సమయపాలనకు నిర్వహించాలని సూచించారు. అటవీశాఖ సహకారంతో నడకదారిలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్ర పరిధిని జోన్లుగా, సెక్టార్లుగా విభజించి ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులరద్దీకి అనుగుణంగా అన్నప్రసాద వితరణ చేయాలన్నారు. శ్రీశైలంలో పండుగ వాతావరణం కనిపించేలా పరిసరాల్లో విద్యుద్దీపాలంకరణ చేయాలన్నారు. భక్తులను అలరించేందుకు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, వేదసంస్కృతి, సనాతన ధర్మంపై అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో మండల తహసీల్దార్ కె.వి.శ్రీనివాసులు, అటవీశాఖ రేంజ్ అధికారి సుభాష్‌రెడ్డి, అపోలో వైద్యులు డా.టి.శశిధర్, పీహెచ్‌సీ వైద్యులు ఆర్.శ్రీవాణి, ఏఎస్ఐ గురవయ్య, దేవస్థాన అన్ని యూనిట్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరావు

విత్తన స్టాక్ నిల్వల వివరాలు అందజేయాలి

నంద్యాల(అర్బన్): పత్తి విత్తన శుద్ధి కేంద్రాల్లో ప్రతి నెల శుద్ధి చేసిన విత్తన స్టాక్ నిల్వల రిపోర్టును కంపెనీల వారీగా మండల వ్యవసాయాధికారులకు అందజేయాలని డీఏఓ మురళీకృష్ణ తెలిపారు. విత్తన శుద్ధి కేంద్రాల ద్వారా వచ్చే వ్యర్థాలను ఈటీపీ ప్లాంట్ ద్వారా శుద్ధి చేయకపోతే చర్యలు తప్పవన్నారు. శుక్రవారం ఏఓ ప్రసాదరావుతో కలిసి డీఏఓ పట్టణ శివారులోని భవ్య సీడ్స్, బబ్బూరి ఆగ్రో సీడ్‌లలో రిజిస్టర్లు, కంపెనీల వారీగా స్టాక్ వివరాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అనుమతులు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే ప్రాసెసింగ్ చేయాలన్నారు. తేడాలు వస్తే సీడ్ ప్లాంట్ల యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



భవ్య సీడ్స్‌లో తనిఖీలు చేస్తున్న వ్యవసాయాధికారులు

క్లుప్తంగా

సబ్ జైలు తనిఖీ


మాట్లాడుతున్న న్యాయమూర్తి

డోన్ టౌన్: పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీలతో సమావేశమై వారి వివరాలను తెలుసుకుంటూ ఉచిత న్యాయ సేవల గురించి అవగాహన కల్పించారు. 70 నేళ్ల పైబడిన, ప్రాణాంతక అనారోగ్య ఖైదీలపై ఉన్నారా అని జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సబ్ జైలు పరిసరాలు, భోజన వసతులు, వైద్య సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో డోన్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతి, డాక్టర్ బాలచంద్రారెడ్డి, న్యాయవాది మాధవస్వామి, కోర్టు, సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపు డబ్బు స్వాహా

బొమ్మలసత్రం: పొదుపు మహిళలు బ్యాంక్ నుంచి తీసుకున్న లోన్ డబ్బు సీఆర్పీ నెల నెలా వసూలు చేసి స్వాహా చేసిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. సలీమ్‌నగర్‌కు చెందిన కొందరు మహిళలు రాణి గ్రూప్ పేరుతో కొంత కాలంగా బ్యాంక్ నుంచి లోన్‌లు తీసుకుని తిరిగి చెల్లిస్తూ వస్తున్నారు. కొన్ని నెలల క్రితం గ్రూప్ లీడర్ మూర్తిబాయి ఆధ్వర్యంలో గ్రూపు సభ్యులు లోన్ తీసుకున్నారు. ప్రతి నెల కంతను సీఆర్పీ ఆశా వసూలు చేసి బ్యాంక్‌లో జమచేకుండా స్వాహా చేసింది. విషయం తెలియన గ్రూప్ సభ్యులు లోన్ మొత్తం రూ.11.50 లక్షలు పూర్తయ్యిందని, నూతనంగా మరో లోన్ ఇవ్వాలని బ్యాంక్ వద్దకు వెళ్లారు. లోన్ అలాగే ఉందని బ్యాంక్ అధికారుల నుంచి తెలుసుకుని విస్తుపోయారు. సీఆర్పీని నిలదీయగా పొంతనలేని సమాధానాలు చెబుతుండటంతో గ్రూప్ లీడర్ మూర్తిబాయి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

2,000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను బయటకు తీస్తున్న ఎక్సైజ్‌శాఖ సీఐలు, పోలీసులు

నందికొట్కూరు: పట్టణంలోని నీలిషికారిపేటలో నాటుసారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 2,000 లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. నందికొట్కూరు, ఆత్మకూరు ఎక్సైజ్ సీఐలు రామాంజనేయులు నాయక్, కిశోర్ తమ సిబ్బందితో కలిసి శుక్రవారం విస్తృత సోదాలు నిర్వహించారు. నాటుసారా బట్టీలను ధ్వంసం చేసి బెల్లం ఊటను పారబోశారు. సోదాల్లో ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు కృపవర కుమారి, శంకర్ నాయక్, పద్మనాభం, రాజు, పోలీసులు రామకృష్ణుడు, తిక్కయ్య, కృష్ణుడు, రామచంద్రుడు, మధుప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.

ఎరువు.. ధరువు

- అడ్డగోలుగా ధరలు పెంచేసిన రసాయన ఎరువుల కంపెనీలు
- బస్తాపై రూ.100 నుంచి రూ.200 వరకు పెంపు
- అన్నదాత ఆందోళన

కర్నూలు(అగ్రికల్చర్): ఒకవైపు అధిక వర్షాలు.. మరోవైపు వర్షాభావ పరిస్థితులతో రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ఎరువుల ధరలు పెంచడం పట్ల అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు సప్లయ్ ప్లాన్ ప్రకారం జిల్లాకు ఎరువులు కూడా రావడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఏటా దాదాపు 4.50 లక్షల టన్నుల రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. 50 కిలోల ఎరువు బస్తాపై కనిష్టంగా రూ.100 నుంచి రూ.200 వరకు పెంచింది. 20 బస్తాలైతే ఒక టన్ను. ఈలెక్కన టన్నుపై గరిష్టంగా రూ.2,000 పెరిగింది. త్వరలో డీఏపీ ధర కూడా భారీగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎరువుల కంపెనీలు ధరలను అడ్డగోలుగా పెంచుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం

ఆదోని, పెద్దకడబూరు, మంత్రాలయం, దేవనకొండ, కౌతాళం, హాలహర్వి, ఆస్పరి, కోసిగి తదితర మండలాల్లో మిర్చి సాగు ఎక్కువగా ఉంది. హంద్రీనీవా కాల్వలో నీళ్లు పారుతుండటం వల్ల కూరగాయల సాగు కూడా పెరిగింది. మిర్చి, పత్తికి పెద్ద ఎత్తున కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ వినియోగిస్తున్నారు. రబీలో వర్షాధారం కింద సాగు చేస్తున్న శనగ, జొన్న, నీటి సదుపాయం కింద సాగు చేస్తున్న వరి, వేరుశనగ, మినుము పంటలతోపాటు కూరగాయల సాగు వల్ల రసాయన ఎరువుల వినియోగం పెరిగింది. పత్తికొండ, ఆలూరు ప్రాంతాల్లో వేరుశనగలో మోతాదుకు మించి రసాయన మందులు వాడుతున్నారు. ఈ మండలాల్లో గ్యాప్ పొలంబడి కింద పండించిన వేరుశనగ శాంపిల్స్ తీసి గుంటూరు లాం ల్యాబ్‌కు పంపగా మోతాదుకు మించి రసాయనాలు ఉన్నట్లు తేలడం బట్టి చూస్తే రసాయన ఎరువుల వినియోగం ఎంత భారీగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. రైతులు ఎక్కువగా ఉపయోగించే 28-28-0, 14-35-14, 20-20-0-13, 16-20-0-13, 10-26-26 ఎరువుల ధరలే పెరగడం వల్ల ఒక్కో రైతుపై రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు భారం పడుతోంది. కొన్ని ఎరువుల ధరలు పెరగక పోయినా ప్రైవేట్ డీలర్లు పెరిగాయని ప్రచారం చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నదాతకు ఊరట

2014-15 నుంచి 2018-19 వరకు టీడీపీ అధికారంలో ఉంది. అప్పట్లో కూడా బీజేపీ ప్రభుత్వానికి టీడీపీ కొమ్ము కాసింది. ఆ సమయంలో ఏకంగా నాలుగు సార్లు రసాయన ఎరువుల ధరలు పెరిగాయి. 2019-20 నుంచి 2023-24 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉంది. ఈ సమయంలో రసాయన ఎరువుల ధరలు ఒక్కసారి కూడా పెరిగిన దాఖలాలు లేవు. ఎరువుల ధరలు నిలకడగా ఉండటంతో రైతులకు ఊరట లభించింది. కానీ ప్రస్తుతం ఎరువుల ధరలు పెంచడంలో టీడీపీ, జనసేన పార్టీలు కేంద్రానికి పూర్తి మద్దతు ఇచ్చాయనే ప్రచారం జరుగుతోంది.


రసాయన ఎరువులు

దారిమళ్లుతున్న ఎరువులు

జిల్లాకు వచ్చే ఎరువులు దారిమళ్లుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని కర్నూలు, ఆదోనిలో ర్యాక్ పాయింట్లు ఉన్నాయి. ఇక్కడి నుంచి ఎరువులు హోల్‌సేల్, రిటైల్ డీలర్లకు వెళ్తుంటాయి. ఆదోని ర్యాక్ పాయింట్ నుంచి ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ల డీలర్లకు ఎరువులు సరఫరా అవుతున్నాయి. పలువురు డీలర్లకు ఇచ్చిన అలాట్‌మెంట్ ప్రకారం కాకుండా 50 శాతం వరకు తగ్గించి ఇస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన 50 శాతం ముడుపులు తీసుకొని అనధికార వ్యక్తులకు ఇస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం ఆదోని ర్యాక్ పాయింట్ కేంద్రంగా నడుస్తున్నట్లు సమాచారం.

సప్లయ్ ప్లాన్ ప్రకారం జిల్లాకు రాని ఎరువులు

సప్లయ్ ప్లాన్ ప్రకారం జిల్లాకు ఎరువులు రావడం లేదు. రబీ సీజన్‌కు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ తదితర ఎరువుల అవసరం ఉంది. రబీలో 1.17 లక్షల హెక్టార్లలో పంటలు సాగు అవుతాయి. రబీ సీజన్‌కు 1.07 లక్షల టన్నుల ఎరువుల అవసరం ఉంది. కానీ జిల్లాకు వచ్చింది 93,394 టన్నులు మాత్రమే. యూరియా 27,479, డీఏపీ 5,760, ఎంఓపీ 2,190, కాంప్లెక్స్ 56,866, ఎస్ఎస్‌పీ 1012 టన్నుల ప్రకారం సరఫరా అయ్యాయి.

పెరిగిన రసాయన ఎరువుల ధరల వివరాలు

ఎరువు	పాత ధర (రూ.లలో)	కొత్త ధర
28-28-0	1,680	1,800
14-35-14	1,680	1,800
20-20-0-13	1,100	1,300
10-26-26	1,370	1,470
16-20-0-13	1,150	1,250

ఎరువుల భారం పెరిగిపోతోంది



మేము 50 ఎకరాల్లో పంటలు సాగు చేస్తాం. ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, కంది పంటలతో పాటు రబీలో సాగు చేసిన శనగ, జొన్న, పొగాకు పంటలు ఉన్నాయి. ఎకరాకు 4 బస్తాల ప్రకారం ఎరువులు వినియోగిస్తాం. ఎరువుల ధరలు పెరిగిపోవడం వల్ల ఏడాదికి రూ.40 వేల వరకు భారం పడుతోంది. కేంద్రం రసాయన ఎరువుల ధరలు పెంచడం దారుణం. ఇప్పటికే ఎరువుల ధరలు ఆందోళన కలిగిస్తుండగా తాజాగా మరింత పెంచడం తగదు.

– ఇప్పుల శేషారెడ్డి, లక్ష్మీపురం, కల్లూరు మండలం

22న జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 22న ఆలూరు ఆదర్శ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జూడో సంఘం జిల్లా కార్యదర్శి బి.ఈరన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో బాల బాలికలు, క్యాడెట్ విభాగంలో బాల బాలికలు, సీనియర్స్ విభాగంలో పురుషులు, మహిళలకు ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ కనబరచి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27 నుంచి 29 వరకు రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకు రావాలన్నారు. వివరాలకు 9866621891 సంప్రదించాలన్నారు.

గొలుసు దొంగ హల్‌చల్

కర్నూలు: నగర శివారులోని బీ క్యాంప్‌లో గొలుసు దొంగ హల్‌చల్ చేశాడు. కర్నూలు మండలం ఎల్.పేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలు పెంచలమ్మ బీ క్యాంప్‌లో నివాసముంటున్నారు. శుక్రవారం సాయంత్రం ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని యువకుడు ఆమెను సమీపించి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కుని పరిగెత్తాడు. ఆమె దొంగ.. దొంగ.. అంటూ కేకలు వేసేలోగా కనిపించకుండా పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ సీఐ శేషయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని నేరం జరిగిన తీరును పరిశీలించారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జగనన్న కాలనీలో వేసెయ్‌పాగా!

- ఖాళీ స్థలాలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోని అధికారులు

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో ఖాళీ స్థలాలను కొందరు ఆక్రమించుకుని దర్జాగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. జగనన్న కాలనీలో ఎన్‌హెచ్340సీ రోడ్డుకు సమీపంలో ఉండటంతో సెంట్ కనీసం రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ధర పలుకుతుంది. లబ్ధిదారులకు ఇవ్వగా మిగిలిన ఖాళీ స్థలాలపై కన్నేసిన కొందరు.. శుక్రవారం ఏకంగా ఇంటి నిర్మాణం ప్రారంభించారు. జగనన్న కాలనీ వాసులు అడ్డుకునేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో ఇదే విషయాన్ని తూడిచెర్ల రెవెన్యూ సదస్సులో ఉన్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌ను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వెంటనే అక్రమ నిర్మాణాలను ఆపాలని కోరారు.


అక్రమంగా ఇల్లు నిర్మించుకుంటున్న దృశ్యం

పెద్దాసుపత్రిలో యువకునికి అరుదైన ఆపరేషన్

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా చిన్నపేగు పెద్ద పేగులోనికి వెళ్తుంది. కానీ ఈ యువకునికి చిన్నపేగు కణితి కారణంగా చిన్నపేగులోనికే చొచ్చుకుపోయి కడుపునొప్పితో కొన్ని నెలల పాటు ఇబ్బంది పెట్టింది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జనరల్ సర్జరీ వైద్యులు ఈ సమస్యను గుర్తించి ఆ యువకునికి శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతం చేశారు. తెలంగాణ రాష్ట్రం మానపాడు మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన ఆకాష్(19) ఆరు నెలలుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ వైద్యం పొందుతున్నాడు. ఈక్రమంలో సరిగ్గా తినక పది కిలోల బరువు తగ్గాడు. రక్తహీనతతో బాధపడుతూ హెచ్‌బీ 7కి తగ్గింది. మెరుగైన వైద్యం కోసం ఈనెల 16న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎంఎస్-1 వార్డులో చేరాడు. రక్తపరీక్షలు, సీటీ స్కాన్ అనంతరం కడుపులో చిన్నపేగులోకి చిన్నపేగు వెళ్లి, భోజనం కిందకు వెళ్లకుండా ఆపేదని వైద్యులు గుర్తించారు. టర్మినల్ ఇలియమ్ ముందు భాగంలో ఉన్న చిన్నపేగులోకి వెళ్లింది. శుక్రవారం జనరల్ సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ పి.హరిచరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ విజయ్‌బాబు, డాక్టర్ నరేష్, డాక్టర్ అబ్దుల్ అహ్మద్, పీజీలు అనంతనాగ్, సంగీత తదితరులు శస్త్రచికిత్స చేశారు. రెండు యూనిట్ల రక్తం ఎక్కించారు. లోపలికి వెళ్లిన చిన్నపేగును మొత్తం బయటకు తీసి అది ఎందుకు లోపలికి వెళ్లిందోనని పరిశీలించగా అందులో కణితి ఉన్నట్లు గుర్తించారు. కణితి ఉన్న చిన్నపేగును తీసి, మళ్లీ పేగును జతచేశారు. కణితి పరీక్షకు పంపించారు. వైద్యపరిభాషలో దీనిని ఇలియో ఇలియల్ ఇంటసెప్షన్ అంటారని డాక్టర్ హరిచరణ్ తెలిపారు. అరుదైన ఆపరేషన్ చేసినందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ వైద్యులను అభినందించారు.


ఆపరేషన్ అనంతరం యువకుడి వద్ద వైద్యులు

స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో సాధారణ తనిఖీలతోపాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ చెప్పారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం వచ్చిన దరఖాస్తులను కమిటీ ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. వీటిని జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సభ్యులు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిమిటీ కమిటీ ఆమోదం కోసం పంపిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ తెలిపారు. ఆడపిల్లల ప్రాముఖ్యత, సరైన వివాహ వయస్సుపై అవగాహన కోసం ఎన్‌జీఓల సహాయంతో ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల్లో డిగ్రీ, ఇంటర్, నర్సింగ్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, ఎఫ్‌డీపీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలమురళీకృష్ణ, పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ అండ్ హెచ్‌ఓడీ డాక్టర్ విజయానందబాబు, రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రాధారాణి, గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంధ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సరళాదేవి, డెమో శ్రీనివాసులు, ఎన్‌జీఓ ప్రతినిధులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, ఎం.నాగరాజు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఈ పద్మావతి, ప్రోగ్రామ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నాగప్రసాద్, చిత్రంలో డీఎంహెచ్‌ఓ, తదితరులు

ఏపీజీబీ కార్యాలయం కడపలోనే కొనసాగించండి

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రగతి గ్రామీణ వికాస్, చైతన్య గోదావరి, సప్తగిరి గ్రామీణ బ్యాంకులు విలీనమైన నేపథ్యంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని యథావిధిగా కడపలోనే కొనసాగించాలని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ నాగరాజు, కోకన్వీనర్ ప్రసాద్ శర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వ్యక్తలు పాల్గొని ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించరాదని, కడపలోనే ఉండాలని తీర్మానం చేశారు. సమావేశంలో ఏపీజీబీ రిటైర్డ్ సంఘాల ప్రతినిధి నాగయ్య, ఏపీజీబీ ఉద్యోగ సంఘాల నేతలు హనుమంతురెడ్డి, నాగరాజు, సురేష్, ఇండియన్ బ్యాంకు ప్రతినిధి రోజారమణి, ఏఐబీఈఏ జిల్లా కార్యదర్శి శివకృష్ణ, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘాల ప్రతినిధి భాస్కరరెడ్డి, సీఐటీయూ ప్రతినిధి రాధాకృష్ణ, న్యాయవాది వీరభావన కుమార్ పాల్గొన్నారు.


రౌండు టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

మండలాల సమగ్రాభివృద్ధి లక్ష్యాలను పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని యాస్పిరేషనల్ మండలాల సమగ్రాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం యాస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధిపై ఢిల్లీ నుంచి నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తూ పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లాలోని యాస్పిరేషనల్ బ్లాక్ మండలాలు హొళగుంద, మద్దికెర, చిప్పగిరిలలో జరుగుతున్న అభివృద్ధిపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యాస్పిరేషన్ బ్లాకులలో జల జీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, అంగన్‌వాడీల్లో మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను కల్పించాలని సూచించారు. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ద్వారా గ్రామ పంచాయతీలకు ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించాలని, ప్రధానమంత్రి అవాస్ యోజన కింద గృహాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువులకు వ్యాధులు సంభవించకుండా టీకాలు వేయాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. పాఠశాలల్లో తాగునీరు, టాయిలెట్లను ఏర్పాటు చేయాలని, గర్భిణులకు రక్త, షుగర్, టీబీ పరీక్షలు నిర్వహించి ఎన్‌సీడీ పోర్టల్‌లో నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, ఇన్‌చార్జ్ సీపీఓ భారతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, డీఈఓ శామ్యూల్‌పాల్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామచంద్రరావు పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్‌పి.రంజిత్‌బాషా

290 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం


రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న లారీలు

డోన్ టౌన్: పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు చేసి సీజ్ చేశారు. గడివేముల మండలం గని గ్రామం నుంచి బెంగళూరుకు వెళ్తున్న లారీని పట్టణ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విజిలెన్స్ సీఐలు పవన్‌కిషోర్, యుగంధర్ తనిఖీ చేసి బియ్యాన్ని గుర్తించారు. అనంతరం రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ మస్తాన్‌ల సమక్షంలో పంచనామా నిర్వహించారు. 50 కేజీల చొప్పున 580 బస్తాలు (290 క్వింటాళ్లు) బియ్యం, లారీని సీజ్ చేసి స్థానిక ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ గోడౌన్‌కు తరలించారు. విజిలెన్స్ అధికారుల ఆదేశాల మేరకు లారీ యజమాని, ఓనర్ బేతంచెర్ల సరస్వతి నగర్‌కు చెందిన ప్రతాప్‌రెడ్డి, బియ్యం రవాణా చేసే నందికొట్కూరు పింజరి పెద్ద దర్గయ్యను నిందితులుగా చేర్చి కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు.

నాకేం తెలియదు

బియ్యం లారీని సీజ్ చేసిన విషయంపై విజిలెన్స్ సీఐ యుగంధర్‌ను వివరణ కోరగా తనకేమీ తెలియదని, పవన్ కుమార్‌ను అడగాలని దాట వేసే సమాధానం ఇచ్చారు. ఉదయం ఈ లారీతోపాటు మరో లారీని కూడా సీజ్ చేసి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే రెండో లారీ ఖనిజ సంపదతో అధిక లోడు ఉన్నందును సీజ్ చేసి పెనాల్టీ వేసి వదిలేశారని సమాచారం.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవించేలా శ్రద్ధ తీసుకోండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే ప్రసవించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పనితీరుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలతో గర్భిణులను వెనక్కి పంపకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో వైద్య సేవలు మెరుగుపడాలన్నారు. ఓపీ సంఖ్య పెరగడంతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. మాతృ శిశు మరణాలను పూర్తిగా అరికట్టాలన్నారు. స్త్రీ శిశు సంక్షేమ అధికారులను సమన్వయంతో బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించి రక్తహీనత బారిన పడకుండా చూడాలన్నారు. గుండె సంబంధిత చికిత్సలు, ఇంజక్షన్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలం చెల్లిన మందులు, ఇతర వృథా పరికరాలను తరలించేందుకు టెండర్లు వేయాలన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ జఫ్రుల్ల తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

అధికారులకు చుక్కెదురు

- పైప్‌లైన్ పనులను అడ్డుకున్న కాలనీ మహిళలు


నీటి తొట్ల వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేట కాలనీలో నగర పంచాయతీ అధికారులకు శుక్రవారం చుక్కెదురైంది. కాలనీలోని బోరు బావి నుంచి నూతన మినరల్ వాటర్ ప్లాంట్‌కు పైపు లైన్ ఏర్పాటు చేసేందుకు యత్నించగా కాలనీ మహిళలు అడ్డుకున్నారు. ఎన్నికల ముందు కోట్ల కుటుంబం బైటిపేట కాలనీకి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హామీలో భాగంగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన అధికారులు బోరు వేయకుండా స్థానికంగా ఉన్న బోరుకే పైప్‌లైన్ ఏర్పాటు చేసుకుందుకు పూనుకోగా తమకు నీటి సమస్య తలెత్తుతుందని కాలనీవాసులు అడ్డుకున్నారు. నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, సీఐ డి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు, టీడీపీ నాయకులు బుగ్గన ప్రసన్నలక్ష్మి, ఆనంద్ రెడ్డి, భీమేశ్వర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పైపు లైన్ పనులను అడ్డుకోవద్దని కోరినా మహిళలు ససేమిరా అన్నారు. బోరు బావి నుంచి మినరల్ వాటర్ ప్లాంట్‌కు కనెక్షన్ ఇస్తే మళ్లీ తాగునీటి సమస్య తలెత్తితే ఎవర్ని అడగాలని కాలనీ మహిళలు శాంతకుమారి, స్రవంతి, సులోచన, నాగలక్ష్మీదేవి, వెంకటలక్ష్మమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా పోలీసుల సహకారంతో అధికారులు పైపు లైన్ ఏర్పాటు చేశా రు. ఈవిషయంపై నగర పంచాయతీ కమిష నర్ హరిప్రసాద్‌ను వివరణ కోరగా మినరల్ వాటర్ ప్లాంట్‌కు కాలనీలోని బోరు బావి నుంచి పైపు లైన్ ఏర్పాటు చేశామన్నారు. కాలనీ వాసులు వ్యతిరేకత వ్యక్తం చేయడంతో ప్రస్తుతానికి కనెక్షన్ ఇవ్వలేదన్నారు. వారంతా చర్చించుకున్నాక నిర్ణయం తీసుకుంటామన్నారు.


పోలీసుల సమక్షంలో పైపు లైన్ పనులు చేస్తున్న సిబ్బంది

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.3,580 కోట్ల ఫీజురీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పు మొత్తాలను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజును చెల్లించకపోవడంతో అన్యాయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చదువుతున్న విద్యార్థులకు సంబంధించి ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలు రూ.2,100 కోట్లు, స్కాలర్‌షిపులకు సంబంధించి రూ.1,480 కోట్ల బకాయిలు ఉండడంతో విద్యార్థులను కాలేజీలు రానిచ్చుకోవడం లేదని, పరీక్షలు రాసేందుకు అనుమతులు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో జీఓ 77ను రద్దు చేస్తామన్న విద్యాశాఖ మంత్రి లోకేష్ అధికారంలోకి వచ్చాక నోరు మెదపడం లేదన్నారు. అలాగే హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు సంబంధించి మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలను 8 నెలలుగా పెండింగ్‌లో ఉంచారని, ఫలితంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్ ఫీజురీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అభి, అశోక్, విజయ్,ఈశ్వర్, చరణ్, చింటు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పెన్సిల్ ముక్కపై ధ్యాన ముద్ర



డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాలకు చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ పెన్సిల్ ముక్కపై ధ్యాన్య ముద్ర, భూగోళం చిత్రాలను గీచి భళా అనిపించాడు. ధ్యానం వల్ల ఒత్తిడి తగ్గి శారీరక, మానసికంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చనే కోణంలో వాటర్ కలర్స్‌తో మైక్రో బ్రష్‌తో చిత్రాన్ని గీసినట్లు కోటేష్ తెలిపారు. – నంద్యాల(అర్బన్)